మాదకద్రవ్యాల నిర్మూలన పై ఎస్ఐ శ్రీనివాసరావు అవగాహన

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలోని వడ్డాది గవర్నమెంట్ కళాశాలలో విద్యార్థులకు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను తన సిబ్బందితో కలిసి సంకల్పం అనే వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల తరగతి గదిలో అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని నిర్దేశిత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని భావితరాలకు బాసటగా నిలవాలని లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు అనంతరం విద్యార్థులు తో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని వాటి నిర్మూలనకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు కార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కరరావు తో పాటు పోలీస్ సిబ్బంది అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల మత్తులో పడొద్దు

ఎస్పీ తుహిన్ సిన్హా

జిల్లాలో అన్ని కళాశాలల్లో 'సంకల్పం'

విశాలాంధ్ర-అనకాపల్లి: విద్యార్థులు, యువతను సన్మార్గంలో నడిపి, వారిలో వ్యక్తిత్వ వికాశం, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగు పర్చి, ఉన్నత లక్ష్యాలను సాధింప జేసేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వారి ఆదేశాల మేరకు సబ్ డివిజన్ల పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో వివిధ స్కూల్స్ , కాలేజీల్లో సోమవారం నుండి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. నేడు సమాజం ఎదుర్కొంటున్న సమస్యల్లో యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడమన్నది ప్రధాన సమస్యగా మారిందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన యువత ఏవిధంగా చెడిపోతున్నారో వివరించి, వారిని తిరిగి సన్మార్గంలో నడిపేందుకు జిల్లా పోలీసుశాఖ "సంకల్పం" అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాల్లో నిర్వహించి, మాదక ద్రవ్యాల వినియోగం యువతపై ఏవిధంగా చెడు ప్రభావాన్ని చూపిస్తున్నది. వారి జీవితాలను, కుటుంబాలను ఏవిధంగా అస్తవ్యస్తం చేస్తున్నదన్న విషయాలు సులువుగా అర్థమయ్యే విధంగా పోస్టర్లు, పాంప్లెట్లు , బ్యానర్లు సంబంధిత స్కూల్ , కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వాలు మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేకంగా చట్టాలను రూపొందించి, శిక్షలను కఠినతరం చేసారన్నారు. హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించి,14 సం. ల జైలు జీవితం తరువాత జైలు నుండి విడుదల చేస్తుంటే, గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పట్టుబడిన నిందితులకు గరిష్టంగా 20సం.లు వరకు శిక్ష విధిస్తున్నారంటే ఈ తరహా నేరాలు, చట్టాల తీవ్రతను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని, ఒకవేళ అలవాటు పడితే ఎటువంటి సంకోచం లేకుండా డీ అడిక్షన్ సెంట రులో ప్రాథమిక స్థాయిలో చికిత్స పొందితే, వాటి నుండి బయట పడవచ్చునని జిల్లా ఎస్పీ అన్నారు. భవిష్యత్తులో డ్రగ్స్ వినియోగదారులు, అమ్మే వారి, సరఫరా చేసేవారి సమాచారం 93929 18196 ఫోన్ చేసి గాని వాట్సాప్ ద్వారా గాని సామాజిక బాధ్యతగా తెలియజేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ జి.ఆర్.ఆర్.మోహన్, పరవాడ సబ్ డివిజన్ కె.వి.సత్యనారాయణ అనకాపల్లి సబ్ డివిజన్ శ్రీమతి ఎం.శ్రావణి అధికారులు జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఇసుకను ఏజెన్సీలకు అప్పగించడం మోసగించడమే : కోన లక్ష్మణ

విశాలాంధ్ర-అనకాపల్లి: ఇసుక ఉచితమంటూనే... రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలతీసుకొచ్చిన నూతన పాలసీ మేరకు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం ప్రజలను మోసగించడమేనని ఆంధ్ర ప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ విమర్శించారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణం లో ర్యాలీ గా బయలు దేరి ఆర్ డి వో కార్యాలయం వద్దచేరి ధర్నా నిర్వహించి ఏ వో కు వినతిపత్రం సమర్పించారు. ధర్నా కు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. సన్యాసి రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తక్షణమే పునరుద్ధరణ చేయాలని, పెండింగ్ లో ఉన్న క్లైం లను వెంటనే పరిష్కారం చేసి వాటికీ నిధులు మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొర బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసి రావు మాట్లాడుతూ ఇసక తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం నిలిపివేయాలని, ప్రభుత్వమే నియోజకవర్గంలో ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఇసుకపై ఉన్న అన్ని రకాల పనులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులుబలిరెడ్డి సూరి అప్పారావు, కోన నూకరాజు, రామారావు సుబ్రమణ్యం, సిహెచ్ అప్పలరాజు, సత్యనారాయణ, చిరంజీవి,చిలుక బాబు, అప్పారావు, గణేష్, మహాలక్ష్మి నాయుడు, వెంకటరావు, రాము నాయుడు, రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం 18న సచివాలయాల వద్ద ఆందోళన

విశాలాంధ్ర-కే కోటపాడు: పేదల ఇళ్ల స్థలాల కోసం గ్రామ సచివాలయాల వద్ద ఈ నెల 18న లబ్ధిదారులతో ఆందోళన నిర్వహిస్తామని సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు తెలిపారు. సోమవారం కింతాడ శివారు రామచంద్రపురం లో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు , పట్టణాల్లో రెండు సెంట్లు స్థలంతో పాటు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు . పేదల ఇళ్ల నిర్మాణానికి సిమెంటు ఇసుక ఇనుము కంకర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లేఔట్లను మార్పులు చేసి అర్హులకు అందించాలని , అలాగే రోడ్లు విద్యుత్ త్రాగునీరు డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటికే సెంటు పట్టా ఉన్నవారు రెండు సెంట్లు కొరకు , గ్రామాల్లో సెంటున్నర పట్టా ఉన్నవారు మూడు సెంట్ల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారు కొత్తగా వ్యక్తిగత అర్జీలతో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రెడ్డి అప్పలనాయుడు , మండల దళిత హక్కుల పోరాట సమితి కార్యదర్శి ఇల్లాకు రాము , సీమునిరి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-నాతవరం.: రైతులు వ్యవసాయంతో పాటు, సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని నాతవరం మండల వ్యవసాయ అధికారి సి. శైలజ తెలిపారు. రైతుల సమాచార హక్కు చట్టంపై గన్నవరం గ్రామం నందు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు ఈ చట్టం వినియోగించుకుని 30 రోజుల్లోగా సంబంధించిన సమాచారము ను పొందవచ్చని అన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు మరింత శిక్షణ ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలి

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అందుకుగాను వచ్చిన ప్రతీ అర్జీని అవగాహన చేసుకోవడం, అర్జీ దారుని వద్దకు వెళ్లి సమస్య గూర్చి మాట్లాడడం, సమస్య సంబంధిత శాఖ పరిధిలోనిది కాకపోతే తెలియజేయడం, అందుకు గల కారణాలను వివరించడం, తదుపరి కార్యాచరణ పై అర్జీదారునికి అవగాహన కల్పించడం వంటి పంచ సూత్రాలను పాటించాలని తెలిపారు. ప్రజల అందజేసిన అర్జీల గూర్చి సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీచేసారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల నందు ద్వితీయ స్థానం

సాధించిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: జన విజ్ఞాన వేదిక వారిచే ఈ నెల 9, 10వ తేదీల్లో విశాఖపట్నం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల నందు జరిగిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు - 2024 పోటీల నందు శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎస్.కిరణ్, ఎమ్.సాత్విక్, ఓ. సాయి శ్రావణ్ జయదీప్ బృందం చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో 52 బృందాలు పాల్గొన్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేతలు సిహెచ్.వి.కె. నరసింహారావు, సిహెచ్.విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా కృషి చేద్దాం

సీఐ అల్లు స్వామి నాయుడు

విశాలాంధ్ర-కశింకోట: మాధక ద్రవ్యాల దుష్ప్ర భావాలపై యువతకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని, యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా కృషి చేయాలని అని స్థానిక సీఐ అల్లు స్వామి నాయుడు అన్నారు.సోమవారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కసింకోట ఆర్.ఈ.సీ.ఎస్ రాజీవ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ అవగాహన కార్యక్రమాన్ని సీఐ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశ ప్రగతిని ముందుకు తీసుకెళ్లవలసింది విద్యార్థినీ, విద్యార్థులన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా వారు ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వాడకం వలన జీవితం నాశనమవుతుందని, సమాజంలో గుర్తింపు కోల్పోతారన్నారు.ఎన్.డీ.పీ.ఎస్ యాక్టులతో పేరు నమోదైతే సొసైటీలో ఉనికి కోల్పోతారన్నారు.20 ఏళు కఠిన కారాగార శిక్ష ఉంటుందన్నారు.మాదకద్రవ్యాల వినియోగం వలన సామాజిక,మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని, అందుకే దేశభవిష్యత్తును కుంగదీసే మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు. కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి, మాధక ద్రవ్యాల నివారణ,దుష్ప్ర భావాలపై అవగాహన కల్పించే నినాదలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, పాలిటెక్నిక్ కళాశాల ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి చెందాలన్నా, సమాజంలో మార్పు రావాలన్నా విద్యతోనే సాధ్యం

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలలో కలెక్టర్

విశాలాంధ్ర-అనకాపల్లి : నవంబరు 11: భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మైనారిటీ సంక్షేమ దినోత్సవం మరియు జాతీయ విద్యా దినోత్సవాలను కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు విజయ క్రిష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, మైనారిటీ వర్గ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం తొలి విద్యాశాఖామంత్రిగా భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ మన జాతీయ అవసరాలకు తగినట్లుగా విద్యావిధానం రూపొందించి, విద్యను అందరికీ అందుబాటులోనికి తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. వారు దేశానికి అందించిన సేవలకు గాను భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అందించి, కేంద్ర ప్రభుత్వం వారి జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవం గా ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా కూడా ప్రకటించినట్లు తెలిపారు. దేశం అభివృద్ధి చెందాలన్నా, సమాజంలో మార్పు రావాలన్నా విద్యతోనే సాధ్యమని జిల్లా కలెక్టరు తెలిపారు. మైనారిటీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ, మరింత సమర్థవంతంగా అందజేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు వారి పిల్లలను బాగా చదివించాలని, విద్య ద్వారా మాత్రమే వారికి మంచి భవిష్యత్తు వస్తుందన్నారు. జామీ మసీదు ప్రెసిడెంటు పి.ఎస్.ఎన్. హుస్సేన్ మాట్లాడుతూ భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గౌరవార్థం వారి జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవం గా జరుపుకోవడం సంతోషదాయకమని తెలిపారు. మైనారిటీలకు ఉన్నత స్థానాలు, అత్యున్నత గౌరవం అందించిన భారతదేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. ప్రస్తుతం మైనారిటీలకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సమర్థమతంగా అమలు చేయుటకుగాను మైనారిటీ శాఖ జిల్లా కార్యాలయాన్ని వక్ఫ్ బోర్డును, అనకాపల్లిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, మైనారిటీ సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు సత్యపద్మ, ప్రభుత్వ ఖ్వాజీ షేక్ అబ్దుల్లా, మహమ్మద్ జిలానీ, ఉమర్ అబ్దుల్ అలీ, అబ్దుల్ రహమా, మహమ్మద్ అమన్, అబ్దుల్ గఫూర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతాంగం సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలి

చోడవరం తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన ఏపి రైతు సంఘం

విశాలాంధ్ర-చోడవరం : అపరిష్కృతంగా ఉన్న రైతాంగం సమస్యలపై తక్షణమే స్పందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, చోడవరం తహసీల్దార్ పి.రామారావుకు సోమవారం ఏ.పి.రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాలు మేరకు పరిష్కారానికి నోచుకోని రైతాంగం సమస్యలను మండల స్థాయి అధికారులు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారని, వీరివలన పంటలు నష్టంతో బాటు, పెట్టుబడులు ఎక్కువై రైతన్నలు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారని తెలిపారు. ప్రైవేటు ఎరువులు, పురుగు మందులు దుకాణాలపై అధికారులు తనిఖీలు కరువయ్యాయని, దీంతో ఎరువులు దుకాణదారులు ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిపారు. నకిలీలపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పెట్టుబడులు ఎక్కువై రైతాంగం నానా ఇబ్బందుల్లో వున్నను, నేటికీ ప్రభుత్వ సహాయం అందక దిక్కుతోచని స్థితిలో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది అని తెలిపారు. సాగునీటి చెరువులు క్రింద లక్షలు ఎకరాలు సారవంతమైన భూములుండగా, సాగు నీరందక వర్షాధారంగా మాత్రమే పంటలు పండి0చాల్సి వస్తొం దన్నారు. ఉత్తరాంధ్ర లో ఎన్ని సాగునీటి వనరులు వున్న ప్పటికీ వాటి అభివృద్ధి పై పాలకులు, ప్రభుత్వ అధికారులు తగిన శ్రద్ధ చూపకపోవడంతో ఖరీఫ్ లో పంటలు ఎండిపోతున్నాయి అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ప్రధాన చెరువులు, గెడ్డ వాగులు తదితర సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తే రెండు పంటలు పండి సస్య శ్యామలం అవుతాయని తెలిపారు. అధికార కూటమి ప్రభుత్వం పెద్దలు, పాలకులు, ఇరిగేషన్ అధికారులు తక్షణమే ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం సమస్యలు పై స్పందించని ప్రభుత్వానికి అన్నదాతల ఆక్రోశానికి బలి కాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు, వ్య.కా.సం. సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు

మంజూరు చేయాలి: సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

విశాలాంధ్ర-అనకాపల్లి: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆమె మేరకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతంలో రెండు సెట్లు మంజూరు చేయాలని సిపిఐ 18న సచివాలయంలో అర్జీ అందజేయడం జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు చేసి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ లో పెరిగిన సిమెంట్, ఇసుక, ఐరన్ ధరలు వల్ల లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయకపోతే ప్రజలను చైతన్యం చేసి పోరాటం ఉదృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కేఎస్ సన్యాసిరావు, అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై ఎన్ భద్రం, మండల కార్యదర్శి చెల్లూరి నాగరాజు, పోతురాజు, నరాలసెట్టి సత్యనారాయణ, కొరిబిల్లి శంకర్రావు, చిన్ని, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ ప్రగడను కలిసిన కాంట్రాక్టర్ చినరాజులు

విశాలాంధ్ర-అచ్యుతాపురం : రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును ఆయన నివాసంలో సోమవారం కాంట్రాక్టర్, మత్స్యకార నాయకులు మేరుగు చినరాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రగడకు శాలువ కప్పి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. చైర్మన్ ప్రగడను కలిసిన వారిలో మేరుగు రమణ బాబు, ఎరిపల్లి అప్పన్న, మేరుగు వసంతరావు, పేర్ల నాగరాజు, ఎరిపల్లి కోదండరావు ఉన్నారు.

ఏప్రతిభ పరీక్షలు మార్గదర్శిగా నిలుస్తాయి

కాండ్రేగుల వెంకటరమణ

విశాలాంధ్ర-అనకాపల్లి: ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు (టాలెంట్ టెస్టులు) మార్గదర్శిగా నిలుస్తాయని శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఆదివారం శ్రీధర్ సీసీఇ (కాలేజ్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్) ఆర్ఆర్బీ, ఎన్టీపీసీ పోటీ పరీక్షలకు ప్రతిభ పరీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ పేద యువత సంక్షేమం కోసం శ్రీధర్ సీసీఇ నిర్వహించిన ప్రతిభ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనుందని చెప్పారు. గత 29 ఏళ్లుగా నిరుద్యోగులకు శిక్షణ ఇస్తూ ఉపాధికి దోహదపడిన శ్రీధర్ సీసీఇ త్వరలో ఆర్ఆర్బీ, ఎన్టీపీసీ పోటీ పరీక్షలకు ఇవ్వనున్న ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల శిక్షణ పొందలేకపోతున్న గ్రామీణ, పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ చుక్కానిలా నిలుస్తుందని కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ సీసీఇ డైరక్టర్ ఎ.అన్వేష్‌రెడ్డి, ప్రతినిధి కె.రమేష్ శ్రీ గౌరీ గ్రంథాలయ ప్రతినిధి కాండ్రేగుల అప్పారావు (కెప్టెన్) పాల్గొన్నారు. ప్రతిభ పరీక్షకు అనకాపల్లి, చోడవరం, ఎస్.రాయవరం, రావికమతం, రాంబిల్లి, అచ్యుతాపురం, కశింకోట, సబ్బవరం, చీడికాడ, యలమంచిలి మండలాల నుంచి 100 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.

శివన్నామస్మరణతో మారుమ్రోగిన పంచదార్ల శివాలయం

విశాలాంధ్ర-రాంబిల్లి: కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో మండలంలో పలు గ్రామాలలో శివాలయాలు కళకళలాడాయి. మండలంలో పంచదార్ల గ్రామంలో గల చారిత్రక విశిష్టత కలిగిన శ్రీ ఉమాధర్మ లింగేశ్వరాలయం అతి ప్రాచీన శైవక్షేత్రం కావడం,ఈ ఆలయ ప్రదేశంలో ఎల్లవేళలా భూగర్భం నుంచి పైకి వచ్చే ఐదు నీటి ధారలలో (పంచధారలు) భక్తులు తెల్లవారుజామునుండే స్నానమాచరించి శివాలయంలో శివలింగాన్ని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ఆలయ విశిష్టత గురించి భక్తులకు తెలియజేశారు. ప్రస్తుతం శివాలయం ఉన్న స్థానంలోనే స్వయంభూ లింగం ఉండేదని కాలగతిలో అది మరుగున పడగా నారదుని సూచన మేరకు ధర్మరాజు తన కుష్టు వ్యాధి నివారణ నిమిత్తం మరొక వర్ధమాన లింగాన్ని ఇక్కడ ప్రతిష్టించాడని,ధర్మరాజుచే పునఃప్రతిష్టించబడిన లింగం కనుక ధర్మ లింగేశ్వర ఆలయం అని పేరు వచ్చిందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.కాగా ఆలయ ఈ ఓ సాంబశివరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు,వెంకటాపురం గ్రామ టీడీపీ అధ్యక్షులు ఎస్.ఎస్.రాజు,యలమంచిలి జనసేన పార్టీ నాయకులు పూటకూటి రమేష్, నగిరెడ్డి కాసు బాబు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీసాంబమూర్తిని దర్శించుకున్న సతీష్ కుమార్

విశాలాంధ్ర-మునగపాక: మునగపాక శ్రీసాంబమూర్తి శూలాల మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ హాజరై సాంబశివుని దర్శించుకున్నారు.ఆయనకు ఆలయ కమిటీ శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు,మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం,గ్రామ ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు,శరగడం యోగి నాగేశ్వరావు,జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు,కారుకొండ కాశీ,కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-యస్.రాయవరం: కార్తీక సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుండి మండలంలోని ఎస్. రాయవరం, సర్వసిద్ధి, పేద ఉప్పలం, పెదగుమ్ములూరు తదితర గ్రామాల్లో భక్తులు శివాలయాలకు వచ్చి శివుడుని దర్శించుకున్నారు. ఎస్. రాయవరం బుర్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నామవరంలో రూ. 9 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం



విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని నామవరం గ్రామంలో రూ. 9 లక్షలతో నిర్మించే రెండు సిమెంట్ రోడ్లకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు శంకుస్థాపన చేశారు. ఇందులో 75శాతం ఉపాధి హామీ పథకం నిధులు కాగా, 25 శాతం పంచాయతీ నిధులతో రోడ్లు నిర్మిస్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, కురందాసు శివ, పల్లా బాబురావు, గొర్ల లక్ష్మి నారాయణ, సూరిబాబు, బాబ్జి, నత్తిబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలను నిరాశ పరచిన రాష్ట్ర బడ్జెట్

గనిశెట్టి సత్యనారాయణ

విశాలాంధ్ర-పరవాడ: రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం అసంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జట్ అనకాపల్లి జిల్లా వాసులను తీవ్ర నిరాశ పరిచిందని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూసిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీల ప్రస్తావన లేకపోవడం ఆవేదనకు గురి చేసిందన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద చెరుకు పండించే ప్రాంతాన్ని కాపాడుకోకుండా, ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేస్తామన్నా ప్రజలను మోసగించడం తప్ప మరొకటి కాదన్నారు. దీంతో పాటు పరవాడ మండలం తాడి, మూల స్వయంవరం గ్రామాల తరలింపు గురించి కనీస ప్రస్తావన లేకపోవడం జిల్లా ప్రజలను మోసం చేసినట్లేనని గనిశెట్టి పేర్కొన్నారు.

ప్రైవేటీజెన్సీలకుఉచిత ఇసుక అప్పగించొద్దు

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వై ఎన్ భద్రం

విశాలాంధ్ర-అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అపహాస్యం చేస్తుందని దాన్ని సరిచేసి అందరికీ ఉచిత ఇసుక అందేలా చూడాలని ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు వై ఎన్ భద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన భవననిర్మాణ కార్మిక సంఘ ధర్నా కు అధ్యక్షత వహించి ఆయన మాట్లాడుతూ. ఇసుకను ప్రైవేటు సంస్థలు కు అప్పగించాలని ప్రభుత్వం చూడ్డం దుర్మార్గమన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఇసుక స్టాక్ పాయింట్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఐ టి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన దొరబాబు మాట్లాడుతూ. గత ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నిర్లక్ష్యం చేయడం వల్ల అనేకమంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని మరణించిన,, కార్మికుల కుటుంబాలకు బీమా పరిహారం అందలేదన్నారు 42 వేల మంది కార్మిక కుటుంబాలకు పరిహారం చెల్లించవలసి ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు మాట్లాడుతూ. గత ప్రభుత్వం తమ అవసరాలకు సంక్షేమ బోర్డు నిధులు మళ్ళించిందని వాటిని తిరిగి బోర్డు ఖాతాలో జమ చేయాలన్నారు. ధర్నా నుద్దేశించి పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో శరగడం సుబ్రహ్మణ్యం, మొల్లేటి ఈశ్వరరావు, మద్దాల రాము, రామ అప్పారావు, పిల్ల మహాలక్ష్మి నాయుడు, వెంకటరమణ, చెల్లూరు నాగరాజు, కోరుబిల్లి శంకర్రావు, చీర రాజు, చిలుకు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవోకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

పంచాయతీ రికార్డుల నమోదుపై ఎంపీడీవోకు ఫిర్యాదు

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలోని రాజాం గ్రామంలో గత ఆరు నెలలుగా జనన మరణ ధ్రువీకరణ రికార్డుల్లో పంచాయతీ అధికారులు నమోదు చేయడం లేదని గ్రామ వార్డు మెంబర్ సామాజిక కార్యకర్త ఆకుల ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు మండల ఎంపీడీవో కు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జనాభా సుమారు పదివేల మంది వరకు ఉంటారని గత ఆరు నెలలుగా రికార్డులు నమోదు కాకపోవడం వలన ఈ మధ్యకాలంలో కొంతమంది అనారోగ్య కారణాలతో చనిపోయారని వారి రికార్డులు జనన మరియు మరణ ధ్రువీకరణ రికార్డులో నమోదు కాకపోవడంతో వితంతువులకు పెన్షన్లు పెట్టుకోవడానికి వీలు కుదరడం లేదని వారు సచివాలయానికి పలుమార్లు తిరిగిన ప్రయోజనం ఉండడం లేదని గ్రామస్తులు అభ్యర్థన మేరకు వార్డు మెంబర్గా సామాజిక కార్యకర్తగా ఎంపీడీవో దృష్టికి సమస్యను తీసుకెళ్లానని ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

అభివృద్ధి ప్రణాళిక పై రెండు రోజుల శిక్షణ

విశాలాంధ్ర-కె.కోటపాడు : గ్రామ మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 12,13 తేదీల్లో అధికారులకు ప్రజాప్రతినిధులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. 12న అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొంటారని అన్నారు. 13వ తేదీన ఎంపీపీ జడ్పీటిసి ఎంపీటీసీలు కోఆప్షన్ మెంబర్లు సర్పంచులు పాల్గొంటారని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తప్పనిసరిగా అందరు సభ్యులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీపీఎం ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పరవాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గొర్లివానిపాలెం పంచాయితీ పరిధి జెఎన్ఎన్యుఆర్ఎం కాలనీలో సోమవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా సీపీఎం నాయకురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి ప్రజలపై తీవ్రమైన బారం మోపుతున్నారని ఆరోపించారు. నిత్యావసరాల ధరలు నియంత్రించి విద్యుత్ ట్రూ అప్ చార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేసారు. ప్రజా సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమాలు ఆగవన్నారు. కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని ఈ సంధర్భంగా మాణిక్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమణమ్మ, పార్వతి, లక్ష్మి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వామలింగేశ్వర స్వామి ఆలయం లో భక్తుల సందడి

విశాలాంధ్ర-మాకవరపాలెం : కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో మాకవరపాలెం పెద్దమిల్లు సెంటర్ వద్ద శ్రీ వామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రధాన అర్చకులు దొరబాబు వామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకంలు వీబూది అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు . మహిళలు సర్పానది ఒడ్డున, ఉసిరి చెట్టు వద్ద కార్తీకదీపాలను వెలిగిస్తూ కార్తీకమాన పూజలో భక్తి తో తరిస్తున్నారు.

తామరం రామాలయంలో రుద్రపూజ

విశాలాంధ్ర -మాకవరపాలెం: మాకవరపాలెం మండలం తామరం రామాలయంలో సోమవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రుద్రపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ శిష్యులచే అత్యంత ఘనంగా నిర్వహించారు. రుద్రపూజతో పాటు ప్రత్యేక భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

శివనామస్మరణతో మారుమోగిన తీరం

శ్రీశ్రీ స్వయంభు శివునికి పూజలు

విశాలాంధ్ర-అచ్యుతాపురం : మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడక శివారు కొండపాలెం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ స్వయంభు శివశక్తిని చైతన్య క్షేత్రం, అర్ధనారీశ్వర ఏకత పిరమిడ్ రెండవ కార్తీక సోమవారం శివనామస్మరణతో మారుమోగింది. వేకువజామున నుంచి మహిళలు స్వయంభు శివుని దర్శించుకొని దీపారాధనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు . మధ్యాహ్నం యోగ భోజనం, సాయంత్రం భజనలు నిర్వహిస్తారని శివ భక్తుడు తెలిపారు .

మా భూమి రికార్డులో నమోదు చేయాలి

విశాలాంధ్ర-మాడుగుల: రీసర్వేలో తప్పుగా నమోదైన మా భూములను సరిచేయాలని మండలంలోని లోవ కృష్ణాపురం గ్రామానికి చెందిన సాగాని భీమేశ్వరరావు సాగాని గోసన్న దొర, కుటుంబ సభ్యులు డిమాండ్ అర్జీలు పెట్టుకున్నారు. సోమవారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఇరువురు తమ భూమి తమకే చెందాలని దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ సదస్సులో తమ భూమి ఇతరుల ఆధీనంలోకి వెళ్లింది. ఇతల పేర్లు నమోదు అయిందని విచారణ వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు చేపట్టి మాభూమి రికార్డులో అధికారులను వేడుకొన్నారు. ఈ విషయం రెవెన్యూ సదస్సులో ఉన్న మండల సర్వేయర్పై అధికారి దృష్టికి తీసుకు వెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

15న విజయనగరంలో జరిగే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయండి

పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్

విశాలాంధ్ర-చోడవరం: ఉత్తరాంధ్ర కరువు, వలసలు-విద్య, ఉపాధిరంగ సమస్యలు-కర్తవ్యాలు" అనే అంశంపై జరిగే "ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు"ను, విద్యార్థి, యువకులు, మేధావులు విజయవంతం చేయాలని పి.డి.ఎస్.ఓ. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ కోరారు. చోడవరం గవర్నమెంట్ జూనియర్ కాలేజీ వద్ద సదస్సు పోస్టర్ ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వలసలకు, వెనుకబాటుతనానికి కేరాఫ్ అడ్రస్ గా ఉందని, స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అన్ని పాలకవర్గ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం ఉత్తరాంధ్రను కావాలనే అభివృద్ధి చేయడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం అమలు చేయాల్సిన విభజన హామీలను వేటిని కూడా అమలు చేయలేదు. విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు కేటాయించిన విశాఖ రైల్వే జోన్ ను, విశాఖలో సెంట్రల్ యూనివర్సిటీని, గిరిజన యూనివర్సిటీని, విద్యాసంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలని, మూతపడ్డ జూట్, చక్కెర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులను కేటాయించాలని, ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వ%శీ% లో కొనసాగించాలని, పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్, మెస్ బిల్లులు రిలీజ్ చేయాలనీ, ఉత్తరాంధ్రలో విచ్చలవిడిగా యువతకు అందుబాటులో ఉంటున్న గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, వలసలను అరికట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ, విజయనగరంలో జరగబోయే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సుకు ప్రారంభకులుగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డా?డి.వి.జి. శంకరరావు, ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వక్తలుగా కేంద్ర-రాష్ట్ర మాజీ సలహాదారు వై.వి.ఎస్. మహదేవన్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి తదితరులు పాల్గొని, ప్రసంగిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ నాయకులు సిహెచ్. శివాజీ, ఆర్.రామకృష్ణ, ఏ.అఖిల్, ఎస్.మణికంత, కె.యశ్వంత్, మునీంద్రా తదితరులు పాల్గొన్నారు.

యువతను చైతన్యం చేయడమే సంకల్పం కార్యక్రమం ఉద్దేశం

సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్.భీమరాజు

విశాలాంధ్ర-నాతవరం: యువతను మేల్కొల్పి చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు సంకల్పం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నాతవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్.భీమరాజు తెలిపారు. సోమవారం నాడు నాతవరం గ్రామం లో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఎస్.ఐ. భీమరాజు మాట్లాడుతూ నేడు సమాజం ఎదుర్కొంటున్న సమస్యల్లో యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడం అన్నది ప్రధాన సమస్యగా మారిందని, దీనివలన యువతలో డ్రగ్స్ వినియోగం ఎక్కువ అవుతుందని, వారిని తిరిగి సన్మార్గంలో నడిపేందుకు జిల్లా పోలీస్ శాఖ సంకల్పం అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మాదకద్రవ్యాలు యువతపై ఏ విధంగా చెడు ప్రభావాన్ని చూపించి, వారి జీవితాలను కుటుంబాలను అస్తవ్యస్తం చేస్తుందో తెలియపరిచారు. డ్రగ్స్ వినియోగం తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వాలు, నియంత్రణకు ప్రత్యేక చట్టాలను రూపొందించి శిక్షలను కఠిన తరం చేసిందన్నారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాలతో పట్టుబడిన నిందితులకు గరిష్టంగా 20 సంవత్సరాల వరకు శిక్షణ విధిస్తున్నారంటే, ఈ తరహా నేరాలు, చట్టాలు తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో తెలుసుకోవాలన్నారు. ఒకవేళ యువత డ్రగ్స్ కు అలవాటు పడితే ఎటువంటి సంకోచం లేకుండా డి అడిక్షన్ సెంటర్లో ప్రాథమిక చికిత్స పొందితే, వాటి నుంచి బయటపడవచ్చు అన్నారు. డ్రగ్స్ వినియోగించిన, సరఫరా చేసిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

జడ్పీ హై స్కూల్ కి రాంకీ ఫౌండేషన్ వితరణ

విశాలాంధ్ర-పరవాడ : పరవాడ జడ్పీ బాయ్స్ హైస్కూల్లోని మధ్యాహ్న భోజన పథకానికి రాంకీ ఫౌండేషన్ వంట పాత్రలను వితరణ చేసింది. సోమవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్ బక్షి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ చేతుల మీదుగా స్టవ్, మిక్సర్, కుక్కర్ లను పాఠశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఫౌండేషన్ సహాయ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఇది వరకూ ఇదే పాఠశాలలో పరవాడ సెప్టిక్ ట్యాంక్ నిర్మించడం జరిగిందన్నారు. అలాగే ప్రస్తుతం కంప్యూటర్ ల్యాబ్ మంజూరు చేశామని పేర్కొన్నారు. అనంతరం వంట పాత్రలు అందజేసిన రామ్కీ ఫౌండేషన్ వారికి విద్యా కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి చుక్క ఉమా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎమ్ బొడ్డు అప్పలనాయుడు, హై స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతను మేలు కొలిపేందుకే సంకల్పం: ఎస్సై

విశాలాంధ్ర -మునగపాక: విద్యార్థులు, యువతను సన్మార్గంలో నడిపి, వారిలో వ్యక్తిత్వ వికాశం, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగు పర్చి, ఉన్నత లక్ష్యాలను సాధింప జేసేందుకు సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు. మండలంలోని తాటిపల్లి మోడల్ స్కూల్లో సోమవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.నేడు సమాజం ఎదుర్కొంటున్న సమస్యల్లో యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడమన్నది ప్రధాన సమస్యగా మారిందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన యువత ఏవిధంగా చెడిపోతున్నారో వివరించి, వారిని తిరిగి సన్మార్గంలో నడిపేందుకు జిల్లా పోలీసుశాఖ సంకల్పం అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాల్లో నిర్వహించి, మాదక ద్రవ్యాల వినియోగం యువతపై ఏవిధంగా చెడు ప్రభావాన్ని చూపిస్తున్నది. వారి జీవితాలను, కుటుంబాలను ఏవిధంగా అస్తవ్యస్తం చేస్తున్నదన్న విషయాలు సులువుగా అర్థమయ్యే విధంగా పోస్టర్లు, పాంప్లెట్లు మరియు బ్యానర్లు సంబంధిత స్కూల్, కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్న చిన్న వీడియోలను ప్రదర్శిస్తున్నామన్నారు. అదే విధంగా మత్తు పదార్థాలు యువత శరీరం, నాడీ వ్యవస్థపై దుష్ప్రభావాన్ని ఏవిధంగా చేస్తుందో పవర్ పాయింట్ ప్రజెంటేషనుతో వివరించి, యువతలో చైతన్యం తీసుకొని వచ్చేందుకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు.యువత ఒకసారి డ్రగ్స్ ను వినియోగిస్తే ఏమీ కాదన్న భ్రమలో ఉంటారని, కాని డ్రగ్స్ ఒకసారి వినియోగించిన తరువాత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడానికి ఎంతో సమయం పట్టదన్నారు. తోటి స్నేహితులు ప్రోద్భలంతోనో, డ్రగ్స్ తీసుకొంటే ఏవిధమైన ఆనందాన్ని పొందవచ్చునో తెలుసుకోవాలన్న ఆసక్తి, స్నేహితులు హేళన చేస్తారనో, చులకనగా చూస్తారన్న భావనతోను వారి ఒత్తిడికి తలొగ్గి, మాదక ద్రవ్యాలను సేవించడం, వాటికి అలవాటు పడి, చివరకు బానిసలుగా మారుతారన్న వాస్తవాన్ని యువత గుర్తించలేకున్నారన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం మహాధర్నా విజయవంతం చేయాలి

బిఎస్పి నేత సూదికొండ మాణిక్యాలరావు

విశాలాంధ్ర -అనకావల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ ఒకటవ న కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు కోరారు. విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం జరుగుతున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ వద్ద ప్రజా సంఘాల నేతలతో కలిసి మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూదికొండ మాణిక్యాలరావు మాట్లాడుతూ. మహనీయ బాబాసాహెబ్ అంబేద్కర్ దయతో మన భారత రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ మూలంగా బహుజనులు అభివృద్ధి చెందడం ఉన్నత స్థానాలకు చేరడం చూసి ఓర్వలేక మనువాద బిజెపి ప్రభుత్వం బహుజనల రిజర్వేషన్ తొలగించేందుకు గాను ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసే కుట్రలకు తెర లేపిందని ఈ కుట్రలో భాగంగానే విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని దుర్మార్గ ఆలోచన చేస్తున్నదని మాణిక్యాలరావు ఆరోపించారు. ఎంతోమంది ఉద్యమకారులు తమ జీవితాలను ఫణంగా పెట్టి తమ ప్రాణాలను త్యాగం చేసి ఆంధ్రులు సాధించుకున్న విశాఖ ఉక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వకూడదని అందుకోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం డిసెంబర్ నెల ఒకటో న జరిగే మహాధర్నాను అన్ని ప్రజా సంఘాలు మహిళా విద్యార్థి కార్మిక రైతు ఉద్యోగ సంఘాలన్నీ ఐక్యంగా విజయవంతం చేయాలని మాణిక్యాలరావు విజ్ఞప్తి చేశారు ..

గిరిజన సాగు రైతులకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-మాడుగుల: మాడుగుల మండలం జాలంపల్లి, శంకరం పంచాయితీ, పెద్ద కూర్మనాధపురం ఆవాస గ్రామాల ఆదివాసి రైతులు మాడుగుల మండలం తహశీల్దార్ను కలిసి తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి సంఘం గౌరవ సలహాదారు అజయ్ కుమార్ మాట్లాడుతూ జాలంపల్లి పంచాయతీలో 175 పేద కుటుంబాలు గత 30 సంవత్సరాలుగా సీలింగ్ మిగులు భూములు సాగు చేస్తున్నారని తమ సాగు అనుభవాన్ని గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరుతూ అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపించారన్నారు. కానీ నేటి వరకు రెవెన్యూ అధికారులు స్పందించక పోవడం వలన ఆదివాసీలు ఇతర పేదలు తమ సాగు భూములకు పట్టాలు లేక ప్రభుత్వం వ్యవసాయక రంగానికి ఇస్తున్న సహాయాన్ని పొందలేకపోతున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో అధికారులు రీ సర్వేలో పట్టాలిస్తామని చెప్పారని రీ సర్వే కూడా మొదలయ్యిందని కానీ ప్రభుత్వం మారడంతో అది అర్థాంతరంగా ఆగిపోయిందని అజయ్ కుమార్ గుర్తు చేశారు. మాడుగుల శాసనసభ సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి చొరవ తీసుకొని రెవెన్యూ అధికారులతోనూ, సాగుదారులతోనూ ముఖాముఖి సమావేశం కావాలని అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని పెద్ద కూర్మనాధపురం గ్రామంలో సర్వేనెంబర్1, 2, 8, 9 మొదలైన సర్వే నంబర్లలో ప్రభుత్వ బంజరు భూమి ఉందని అదే గ్రామ పంచాయతీలోని ఆదివాసి పేదలను గుర్తించి వారికి ఆ భూములు పంపిణీ చేయాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రీ సర్వేలో భాగంగా గొప్పులపాలెం గ్రామంలో ఇంటి స్థలాలకు సంబంధించిన భూమిని పట్టా భూమిగా చూపించారని దానిపై విచారణ జరపాలని ఆదివాసీలు తాసిల్దార్ని కోరారు. జాలంపల్లి సీలింగ్ మిగులు భూములకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని ఆ ప్రాప్తికి ఒక నివేదిక పంపిస్తామని తాసిల్దార్ హామీ ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో వద్దాది మాడుగుల మండలంలో అత్యధిక స్థాయిలో ఆదివాసీలు ఉన్నారని వారి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు మరియు స్థానిక శాసనసభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. జాలంపల్లి, శంకరం పంచాయతీలకు చెందిన 100 మందికి పైగా ఆదివాసీలు ఇతర పేద రైతులు ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇ నరసింహమూర్తి సంఘీభావాన్ని తెలియజేశారు.

14 నుంచి గ్రంధాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-మాడుగుల: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మాడుగుల గ్రంధాలయాధికారి యడ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 14న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులచే బాలల దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటం ఆవిష్కరణ, విద్యార్థులచే ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 15న ఉదయం పుస్తక ప్రదర్శన, సాయంత్రం గ్రంధాదలయంలో పుస్తకాలు చదవడం వల్ల ప్రయోజనాలు గురించి వివరిస్తామన్నారు. 16న గ్రంధాలయ రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖుల గురించి వివరిస్తామని, సాయంత్రం 3, 4 లతరగతుల విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 17న వివిధ జాతీయ నాయకుల గురించి చర్చాగోష్టి, 18న నిరుద్యోగులకు గ్రంధాలయ ఉపయోగంపై చర్చా సమావేశం ఉంటుందన్నారు. 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటం ఆవిష్కరణ, వివిధ మహిళా ప్రముఖుల గురించి సంస్మరణ సభ, 4 గంటలకు 9, 10 విద్యార్థులకు గ్రంధాయాలు, విద్యార్థ భవిష్యత్ పుస్తకాలు అనే అంశంపై వ్యాసరచన, 20న విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

తల్లిదండ్రులకు కౌన్సిలింగ్



విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్ : మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సిఐ వేచలపు నారాయణమూర్తి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో సోమవారం ఎస్ కోట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎం.వి.నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఈ- చలానాలు విధించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ. ఎస్ కోట పోలీస్ స్టేషన్ పరిధిలో పరిధిలో మైనరు డ్రైవింగు, ట్రిపుల్ డ్రైవింగు, సౌండు పొల్యూషను, డేంజరస్ డ్రైవింగు, డిఫెక్టివ్ నంబరు ప్లేట్లుపై ఎం.వి.నిబంధనలను అతిక్రమించి పట్టుబడిన వాహనాలను , ప్రత్యేక డ్రైవ్ ను నవంబరు 9, 10 తేదీల్లో నిర్వహించి, 21 వాహనాల మైనర్లును, వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషనుకు పిలిపించి, కౌన్సిలింగు నిర్వహించి హనాలను అప్పగించడమైనదని. వాహనదారులు తమ వాహనాలను అనుమతి ఉన్నట్లే తమ భద్రతకు, ఇతర వాహనదారులు, పాదచారుల భద్రతకు కొన్ని బాధ్యతలను నిర్వ హించాల్సి ఉంటుం దన్నారు. అంతేకాకుండా, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు,ఎం.వి. నిబంధనలు, రహదారి భద్రత ప్రమాణాలను పాటించడంతోపాటు, హెల్మెట్ ధరించడం, ద్విచక్ర వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించడం, నిర్దిష్ట వేగంతోనే వాహనాలను నడపడం, నిబంధనలకు అనుగుణంగా నంబరు ప్లేట్స్ కలిగి ఉండడం, వాహనాల నిర్మాణాన్ని మారుస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరమని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అబ్దుల్ కలాం జన్మదిన వేడుకలు



విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో సోమవారం స్వాతంత్ర సమరయోధులు,భారత మొదటి విద్యా శాఖ మంత్రి భారతరత్న మౌలనా అబ్దుల్ కలాం ఆజాద్లి గారి జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో బాగంగా జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యా సాగర్ మాట్లాడుతూ దేశ స్వతంత్ర సంగ్రామంలో వీర పోరాటం జరిపి దేశ స్వతంత్ర సాధించడానికి తన వంతు కృషి చేసారని తెలిపారు. మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు %రా% కరీం మాట్లాడుతూ దేశానికి విద్యాభివృద్ధి కొరకు యూనివర్సిటీ గ్రాంట్స్ నిధులను పెంచుటకు కృషి చేసారు. ఈ కార్యక్రమం లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు, మైనారిటీ సెల్ షరీఫ్, సమీర్ రహమాన్, కె.చంద్ర శేఖర్, నెల్లిమర్ల పార్టీ ఇంచార్జ్ గంటా సత్యనారాయణ, గజపతినగరం పార్టీ ఇంచార్జ్ డా.దుర్గా ప్రసాద్, చీపురుపల్లి పార్టీ ఇంచార్జ్ రామచంద్ర రాజు,యస్.కోట పార్టీ ఇంచార్జ్ డా. జి తిరుపతి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కానిస్టేబులు చొరవతో మహిళ ప్రాణాలకు తప్పిన ముప్పు : ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో కంటోన్మెంటు గూడ్సు షెడ్ వద్ద గల శివాలయం ప్రాంగణంలో అగ్ని ప్రమాదానికి గురైన మహిళను రక్షించిన వన్ టౌన్ కానిస్టేబులు ఎన్.మణికంతను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసా పత్రాన్ని ప్రధానం చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో కార్తీక మాసం 2వ సోమవారం కారణంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషను పరిధిలోని శివాలయాలు, పుణ్య స్నానాలు ఆచరించే నదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. అదే విధంగా 1వ పట్టణ పోలీసు కానిస్టేబులు ఎస్.మణికంత పట్టనంలోని గూడ్సు షెడ్ వద్దగల శివాలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహించేందుకు గాను వన్ టౌన్ పోలీసు అధికారులు నియమించారు. శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఉండడం, ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో దీపాలంకరణ చేయడంతో శివాలయ దర్శనానికి వచ్చిన ఒక మహిళా భక్తురాలి చీర చెంగుకు ప్రమాదవసాత్తు దీపం అంటుకోవడం, క్షణాల్లో మంటలు చెలరేగి ఆమె చీర పూర్తిగా కాలిపోవడంతో, భయంతో ఆమె, అక్కడ ఉన్న భక్తులు పరిగెత్తడంతో ఒక్కసారిగా గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఇది గమనించిన కానిస్టేబులు ఎస్.మణికంత గమనించి, చొరవతో ముందుకు వెళ్ళి, మంటలను చేతులతో ఆర్పివేసి, దగ్గరలో స్వాముల వద్ద ఉన్న తువ్వాలును మహిళకు ఇవ్వడంతో, పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. సమయానుకూలంగా స్పందించి, అగ్ని ప్రమాదానికి గురైన మహిళను రక్షించిన కానిస్టేబులు ఎస్.మణికంతను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తన కార్యాలయంకు పిలిపించి, ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని, కానిస్టేబులు మణికంతను అభినందించి, ప్రశంసా పత్రంను ప్రధానం చేసారు.

ఎంపీటీసీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి

మండల పార్టీ అధ్యక్షుడు ఎం. జగ్గు బాబు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని ఎంపీటీసీ సభ్యులంరూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నిమిత్తం అప్రమత్తంగా ఉండాలని మండల పార్టీ అధ్యక్షుడు మమ్ములూరి జగ్గిబాబు ఎంపీటీసీ సభ్యులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతున్న తరుణంలో మన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో జిల్లా నుండి పార్టీ అభ్యర్థిగా శంబంగి చిన అప్పలనాయుడిని బలపరచడంతో ఆయన నామినేషన్ వేయడం జరిగిందన్నారు.అలాగే ఇతరులు ఎవరైనా వచ్చి సంతకాల పెట్టమని అడిగినా ఏటివంటి సంతకాలు పెట్టవద్దని జిల్లా పార్టీ అధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించునందున,ఎటువంటి కాగితాల పై సంతకాలు చేయరాదని అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

ముగిసిన అండర్ 14 వాలీబాల్ క్రీడా పోటీలు



విశాలాంధ్ర-భోగాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గత మూడు రోజులుగా జరుగుతున్న అండర్ 14 రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన విద్యార్థిని,విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. విజేతలకు అభినందనలు తెలియజేసారు. ఈ వాలీబాల్ క్రీడల్లో బాలుర విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విశాఖపట్నం జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. అలాగే బాలికల విభాగంలో కడప జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జట్టు రెండవ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో ఆతిధ్య విజయనగరం జిల్లా జట్టు 3 వ స్థానం దక్కించుకోగా బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు దక్కించుకొంది. విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, జిల్లా డి.ఎస్.డి.ఓ వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె కృష్ణం రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ భగవాన్ దాస్, పరిశీలకులు చందన వర్మ,ఎంఈఓ చంద్రమౌళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవిపిఎన్ రాజు,వ్యాయామ ఉపాధ్యాయులు ఆళ్ల శేఖర్, సింగిడి నాగన్న, బాలిపల్లి రఘు పాల్గొన్నారు.